ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024

మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్



ప్రాణాలకు ముప్పు రాకుండా..
విధులు నిర్వర్తించాలి

- జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 11: వృత్తి ధర్మాన్ని బాధ్యాతాయుతంగా నిర్వర్తించడంతో పాటు ప్రాణాలకు ముప్పు రాకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలో జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్కరణ దినోత్సవం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ భాగం అటవీ ప్రాంతం ఉండడం అటవీశాఖాధికారుల కృషి ఫలితమే అన్నారు. అటవీ సంపదను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సినిమాల్లో తప్పు చేసే వారిని కథానాయకుడిగా చూపించడం సరికాదని, సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా ఉండాలన్నారు. అటవీ సంరక్షణ కోసం ఆధునాతన వస్తు సామగ్రిని, సదుపాయాలను కల్పించడం జరుగుతోందన్నారు. అటవీశాఖలో ఇంటెలిజెన్సీ, కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. ఇందుకు తమతో పాటు ఎస్పీ నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అశోక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగం బాధ్యాతాయుతమైనదన్నారు. విధి నిర్వహణలో ఎంత ఒత్తిడి ఉన్నా తెలివిగా మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రాణం కంటే ఏదీ ఎక్కువ కాదని, అటవీ ప్రాంత సంరక్షణలో పొరపాట్లకు తావివ్వకుండా ఆలోచించి ముందు కెళ్లాలన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన అశోక్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంతో పాటు మనల్ని మనమే కాపాడుకోవాలన్నారు. డివిజనల్ అటవీ అధికారులు గురుప్రభాకర్, నాగార్జునరెడ్డి, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్



వేంపల్లె, సెప్టెంబరు 11: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సంధ్ర అమరేంద్రకుమార్‌ను నియమించారు. ఈమేరకు ఆర్జీయూకేటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ గోపాల్‌రాజుకు రిజిస్ట్రార్‌గా పదవీకాలం పూర్తికావడంతో ఆయన స్థానంలో అమరేంద్రకుమార్‌ను నియమించారు. గతంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఏఓగా ఆయన పనిచేశారు. ఆర్జీయూకేటీలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అమరేంద్రకుమార్ తెలిపారు.

రేషన్‌కార్డుల అక్రమాలకు చెక్



- నాడు వైసీపీ డీలర్లకు అక్రమంగా కార్డుల పెంపు
- నేడు కూటమి ప్రభుత్వంలో రేషన్‌కార్డుల రేషనలైజేషన్
- ప్రతి డీలర్‌కు అర్బన్‌లో 500 నుంచి 550 కార్డులు
- గ్రామీణ ప్రాంతంలో 400 నుంచి 450 కార్డులు
- రేషనలైజేషన్ పూర్తయితే కొత్త రేషన్ షాపులు

ప్రభుత్వంలో సాగిన అక్రమాలకు చెక్‌పెట్టనున్నారు. రేషన్ కార్డుల రేషనలైజేషన్‌కు ప్రభుత్వం ఇటీవలే అను మతి ఇచ్చింది. ఈ

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 11: వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖలో అధికారుల అండతో యథేచ్ఛగా అక్రమాలు సాగాయి. ముఖ్యంగా అప్పటి వరకు వున్న టీడీపీ డీల ర్లను తొలగించి వారిపై అక్రమ కేసులు బనాయించి.. బలవంతంగా రాజీనామా చేయించారు. ఇందులో కొందరు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు అత్యుత్సాహం ప్రదర్శించి డీలర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అంతటితో ఆగకుండా వైసీపీ డీలర్లకు ఇష్టాను సారం అప్పటి తహసీల్దార్లు పెద్దఎత్తున మామూళ్లు తీసుకోని వందలాది రేషన్‌కార్డులను పెంచారు. దీంతో వారి అక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. కొందరు వైసీపీలో కీలకంగా వున్న వారు రేషన్‌కార్డులు అధికంగా కోటా పెంచుకుని బియ్యం అక్రమ రవాణా సాగించారు. లారీల ద్వారా అక్రమంగా జిల్లాలు దాటించి కోట్లు గడించారు. ఇదంతా ఒక వైసీపీ ప్రజాప్రతినిధి అండదండలతో సాగింది. దీంతో నాడు వైసీపీ డీలర్లంతా ఆర్థిక బలం పుంజుకున్నారు.

రేషన్ కార్డుల రేషనలైజేషన్

కూటమి ప్రభుత్వంలోవైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖను అక్రమాలకు కేంద్రంగా మార్చివేశారు. ముఖ్యంగా వైసీపీ డీలర్లకు మేలు జరిగేందుకు బియ్యం దందాలకు అప్పటి సివిల్ సప్లయి అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు సైతం పూర్తి అండదండగా ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక నాటి వైసీపీ రేషనలైజేషన్‌తో గతంలో వైసీపీ డీలర్లు అక్రమంగా పెంచుకున్న కార్డుల పెంపునకు కోత పడనుంది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వ సానుభూతి పరులకు డీలర్ షిప్పులు దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు చెక్ పెడుతూ గతంలో అక్రమంగా డీలర్లు పెంచుకున్న అలాట్ మెంటులను రేషనలైజేషన్ చేయడంతో మరింత మందికి ఉపాధి అవకాశం లభించనుంది.

మున్సిపాలిటీలో 500 నుంచి 550 కార్డులు

మున్సిపాలిటీ ప్రాంతంలో ఒక్కో డీలర్‌కు 500 నుంచి 550 కార్డులు మాత్రమే ఉండేలా రేషన్‌లైజేషన్ చేయనున్నారు. గతంలో కొందరికి కేవలం 200 కార్డులు వుంటే మరి కొంద రికి 800 కార్డులు వెయ్యి కార్డులు కూడా వున్నాయి. దీంతో కొందరు డీలర్లకు కాసులపంట.. మరికొందరి డీలర్లకు కనీస ఉపాధి గిట్టుబాటు కాని వైనం. దీన్ని పూర్తిస్థాయిలో సరిచేసి ప్రతి డీలర్‌కు 500 కార్డుల నుంచి 550 కార్డులకు పరిమితం చేయనున్నారు. దీంతో అంద రికీ న్యాయం జరిగే అవకాశం వుంది.

గ్రామీణంలో 400 నుంచి 450 కార్డులు

వైసీపీ హయాంలో వారి డీలర్లకు కొందరికి 1000 నుంచి 1600 కార్డులకు పైన కూడా అక్రమంగా పెంచుకున్నారు. ఒక్క డీలర్‌కు ఇచ్చే సరుకు నలుగురు డీలర్లకు ఉపాధి కల్పించే అవకాశం వున్నా.. గత వైసీపీ ప్రభుత్వం వారి బియ్యం అక్రమదందా కోసం రేషన్ కార్డులకు ఇష్టానుసారం పెంచుకున్నారు. ఇందులో తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికా రులు పెద్ద ఎత్తున జేబులు నింపుకున్నారనే ఆరోపణలు గతం పెద్దఎత్తున వెలువడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్‌కార్డుల రేషనలైజేషన్‌తో డీలర్లందరికీ సమాన లాభాలు వచ్చేలా చర్యలు తీసుకోవడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేషనలైజేషన్ పూర్తయితే..

రేషన్‌కార్డుల హేతుబద్దీకరణ పూర్తయితే కొత్తరేషన్ దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేయ నుంది. దీంతో మరింత మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యం దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో 49 రేషన్ దుకాణాలు వున్నాయి. ఇందులో 1000 కార్డులకు పైగా వున్న రేషన్ దుకాణాలు 4 ఉన్నాయి. వాటిలో 99 దుకాణాలకు 1064 కార్డులు ఉండగా.. 120 దుకాణానికి 1661 కార్డులు వున్నాయి. 142వ షాపునకు 1178 వుండగా.. 143 దుకాణానికి 1631 కార్డులు వున్నాయి. 500 నుంచి 1000లోపు వరకు కార్డులు వున్న దుకాణాలు 26 వున్నాయి. 140 నుంచి 450 వరకు కార్డులు వున్నవి 20 దుకాణాలున్నాయి

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 94 రేషన్ దుకాణాలున్నాయి. అందులో 1000 కార్డులకు పైగా వున్న రేషన్ దుకాణాలు 3 వుండగా, 500 పైగా కార్డులు వున్నవి 22 దుకాణాలున్నాయి. 500లలోపు కార్డులున్నవి 69 దుకాణాలు ఉన్నాయి. ఇంద ులో కూడా అస్తవ్యస్తంగా కొందరికి ఇష్టానుసారం కార్డులను పెంచారు. వార్డులకు సంబంధంలేకుండా కార్డులను ఎక్కడపడితే అక్కడికి మార్చారు. దీంతో కార్డుదారులు ఆ డీలర్ల దగ్గరికి వెళ్లలేని పరిస్థితి వుండేది. అంతేకాకుండా ఎండియూ ఆపరేటర్లు కూడా ఈ కార్డులు మా పరిధిలోకి రావని చెప్పి కార్డుదారులకు బియ్యం వేసేవారు కాదు. మరికొందరు డీలర్లు తమ కార్డులు కాకున్నా కార్డుదారులతో బియ్యం కొనుక్కొని అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేసేవారు. వైసీపీ హయాంలో బియ్యం బండి నిర్వాహకులే ఎక్కువ శాతం బియ్యంను కొనుగోలు చేసి అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం రేషన్‌బండ్లలోనే సాగించే వారుగా ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఈ అక్రమాలకు చెక్ పడి డీలర్లం దరికీ న్యాయం జరగటంతో పాటు రేషన్ బియ్యం కార్డుదారులందరికీ పంపిణీ జరగటమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.



నెలనెలా తక్కువ మొత్తంలో డబ్బులు చెల్లిస్తే.. లాస్ట్‌లో పెద్ద అమౌంటు వస్తుందనే ఆశతో.. ఎలాంటి అనుమతులు లేని ప్రైవేటు చీటీ వ్యాపారుల వద్ద చీటీలు కడుతూ మోసపోతున్నారు. తొలుత చీటీ పాట పాడగానే.. డబ్బులు చెల్లిస్తూ అందరికీ నమ్మకంగా ఉంటూ.. రూ.లక్షల్లో చీటీలు వేయిస్తూ ఒక్కసారిగా ఆ డబ్బులతో నిర్వాహకులు పరార్ అవుతున్నారు. ఎక్కువ మంది అనుమతులు లేని చీటీ వ్యాపారస్తుల వద్ద ఉద్యోగస్తులు, చదువుకున్న వారే కనిపిస్తున్నారు. ఇటీవల తాలుకా పోలీసుస్టేషన్ చిన్నచౌకు పోలీసుస్టేషన్, టూటౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో బాధితులు ఎక్కువగా కనిపిస్తున్నారు. డబ్బు ఇచ్చినట్లు ఆధారాలు కూడా లేకపోవడంతో పోలీసులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

తెలిసే.. మోసపోతున్నారు



- విచ్చలవిడిగా అనుమతులు లేని చీటీల వ్యాపారాలు
- రూ.కోట్లలో లావాదేవీలు..
- ఉన్నట్లుండి పరార్ అవుతున్న నిర్వాహకులు
- బాధితుల్లో ఎక్కువ మంది చదువుకున్నవారే
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్న వైనం

కడప (క్రైం), సెప్టెంబరు 11: పరారీలో ఉన్న చీటీ నిర్వాహకులు బాధితుల వద్ద నుంచి అప్పుల పేరుతో లక్షలు వసూలు చేసుకుని కోట్లలో ఐపీలు పెట్టి పరారీ అవుతున్నారు. ఇటీవల చిన్నచౌకు పరిధిలో పదిమంది మహిళలపైనే పోలీసులను ఆశ్రయించారు. అలాగే టూటౌన్, వన్‌టౌన్, రిమ్స్, తాలుకా పోలీసుస్టేషన్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. చీటీల పేరుతో మోసం చేసిన నలుగురిపై తాలుకా పోలీసుస్టేషన్‌లోనే ఇటీవల కేసు నమోదు చేశారు. కడప నగరంతో పాటు పలు చోట్ల ఇలాంటి ఘటనలు రోజూ కనబడుతున్నాయి. కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, గౌస్‌నగర్, అల్మాస్‌పేట, సాయిపేట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటిఐ, రవీంద్రనగర్ ఇలా ప్రతి ప్రాంతంలో వీధికొక చీటీ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కడపతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అనుమతి లేని చీటీ వ్యాపారం ఎక్కువగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిలో తరచూ ఎక్కడో ఒక చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే పరారవుతున్నారు.

అనుమతుల్లేకుండా చీటీల నిర్వహణ

చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లోని సభ్యులకు ఖచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. అలాంటిది చట్టబద్రత లేని చీటీలతో ప్రజల జీవితాలు నాశనం అవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా కృంగిపోతున్నారు. నిర్వాహకుల వల్ల సభ్యులు, సభ్యుల వల్ల నిర్వాహకులు మోసపోతూ బాధితులుగా మిగలిపోతున్నారు. ప్రజల్లో అవగాహన ఉన్నప్పటికీ చీటీల నిర్వాహకుల మీద ఉన్న నమ్మకంతో లక్షల్లో చీటీలు కడుతూ సర్వం కోల్పోతూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

జాగ్రత్త లేకపోతే అంతే..

అనుమతుల్లేని చీటీలతో డబ్బులు కట్టుకుని మోసపోయే కంటే తగు జాగ్రత్తలు తీసుకుంటే తమ వద్ద ఉన్న డబ్బు సురక్షితంగా ఉంటుంది. చుట్టుపక్కల వారు చీటీ కడుతున్నారంటూ.. మనం కట్టామా అంతే మరి. ఉన్న సొమ్ము కాస్త పాలు కావాల్సిందే.

మోసపోతూనే ఉన్నారు

ఎన్నిసార్లు మోసపోయినా మళ్లీ మళ్లీ చీటీల పేరుతో మోసపోతూనే ఉన్నారు. కనీసం అవగాహన అన్నా లేని వారనుకుంటే ఏదోలే అనుకోవచ్చు. మంచి విద్యావంతులు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులే ఎక్కువగా చీటీల పేరుతో మోసపోతూ పోలీసులను ఆశ్రయిస్తుండడం గమనార్హం. ఏది ఏమైనా ఇలాంటి చీటీల వల్ల సంపాదించిన సొమ్ము పరులపాలు కావాల్సిందే మరి.



అధికారుల నిర్లక్ష్యం..
మల్బరీ రైతుకు శాపం

- ప్రభుత్వ ప్రోత్సాహకాలున్నా తగ్గిపోతున్న సాగు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- సబ్సిడీల్లో సిబ్బంది చేతివాటం
- పులివెందుల పరిధిలో 319 ఎకరాల్లో మల్బరీ సాగు



పులివెందుల రూరల్, సెప్టెంబరు 11: ప్రభుత్వం ఏ పంటకు ఇవ్వని ప్రోత్సాహకాలు మల్బరీ సాగుకు ఇస్తోంది. మల్బరీ మొక్క నాటినప్పటి నుంచి పట్టు పురుగుల గుడ్లు, షెడ్లు, పురుగులు వేసేందుకు సామగ్రి, పట్టుగూళ్ల అమ్మకం, రైతులకు ప్రోత్సాహకం వరకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుంటుంది. మల్బరీ పంట సాగుచేసి పట్టు పురుగులు వేసిన నెలకే దిగుబడులు ఇస్తుంది. ఐదు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తే నెలకు రూ. 60వేల నుంచి రూ.70వేల ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఇలా దాదాపు ఏడాదికి ఆరు నుంచి ఏడుసార్లు దిగుబడులు పొందవచ్చు. అయితే ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నా పట్టుగూళ్ల విక్రయానికి ప్రత్యేకంగా మార్కెట్ ఉన్నప్పటికి మల్బరీ సాగు నానాటికి తగ్గిపోతోంది. ఇందుకు సెరికల్చర్ అధికారుల అలసత్వమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మల్బరీ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

మల్బరీ సాగు మొదలు పెట్టినప్పటి నుంచి దిగుబడి సాధించిన అనంతరం కూడా రైతును ప్రోత్సహించేలా ప్రభుత్వ సబ్సిడీలు అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, అదర్ కేటగిరీకి 75శాతం సబ్సిడీ అందిస్తున్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు మల్బరీ పంట సాగు చేపట్టిన పొలాన్ని అధికారులు పరిశీలిస్తారు. అనంతరం ఎకరాకు మల్బరీ పంట సాగుకు రూ.30వేలు ఖర్చు అయితే ఎస్సీ, ఎస్టీలకు 90శాతం సబ్సిడీతో రూ.27వేలు, అదర్ కేటగిరీ వారికి 75 శాతంతో రూ.22500 సబ్సిడీ అందిస్తారు. షెడ్డు నిర్మాణం విలువ రూ.4.50 లక్షలు అయితే ఎస్సీ, ఎస్టీలకు రూ.4.05 లక్షలు, అదర్ కేటగిరీ వారికి రూ.3,37,500 సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. అలాగే పురుగులు మేపేందుకు సామగ్రి రూ.75వేలు ఖర్చు అయితే ఎస్సీ, ఎస్టీలకు రూ.67500, అదర్స్‌కు రూ.56250 సబ్సిడీ ఇస్తుంది. అలాగే రూ.1300 పెట్టుబడి పెడితే వంద పట్టు పురుగు గుడ్లు తెచ్చుకుంటే దాదాపు 60వేల పురుగులు ఉంటాయి. ఆ పెట్టుబడిలో కూడా ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, అదర్ కేటగిరీ వారికి 75శాతం సబ్సిడీ వస్తుంది. అలాగే అప్పుడప్పుడు మందులు వాడాల్సి వస్తే అందుకు కూడా సబ్సిడీ అందిస్తుంది. తర్వాత ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మార్కెట్‌లలో కొనుగోలు చేస్తారు. ప్రభుత్వ మార్కెట్‌లో (రాయలసీమలో హిందూపురం) కేజీపట్టుగూళ్లు రూ.600వరకు పలుకుతుందని రైతులు తెలిపారు. ఇవన్నీ అయిపోయిన తర్వాత రైతుకు ప్రోత్సాహకంగా ఏడాదికి ఎస్సీ ఎస్టీలకు రూ.4500, అదర్ కేటగిరికి రూ.3750 ఉచితంగా ప్రభుత్వం రైతుల అకౌంట్లలో జమ చేస్తుంది.

ఉపాధికి అనుసంధానం

మల్బరీ తోట సాగు చేసేందుకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించారు. ఇందులో మల్బరీ మొక్కల నాట్లు, సాగుకు పథకాన్ని అనుసంధానించడంతో రైతుకు మరింత మేలు చేకూరుతుంది. రైతుకు జాబ్‌కార్డు ఉంటే వంద రోజుల పనిదినాన్ని పంట సాగుకు అనుసంధానిస్తారు. వంద రోజుల పనిదినాల్లో ఉపాధి కూలి డబ్బులు జమ అవుతాయి. ఎలా చూసినా రైతుకు ఎంతో మేలు చేకూరుతుందనడంలో సందేహం లేదని పలువురు చెబుతున్నారు. అయితే సిబ్బంది తమ పనితీరును మార్చుకుంటే నిరుద్యోగులకు కూడా స్వయం ఉపాధిగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. అవగాహన కల్పించడంలో, సబ్సిడీల్లో చేతివాటం ప్రదర్శిస్తారనే ఆరోపణలు పలువురు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

170 ఎకరాల్లో సాగు లక్ష్యం..

2024-25కు పులివెందుల పరిధిలో 170 ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ఉంది. జిల్లాలో 425 ఎకరాలలో సాగు లక్ష్యం కాగా.. పులివెందులలో సిబ్బంది ఎక్కువగా ఉన్నందున 170 ఎకరాలు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 33 ఎకరాల వరకు మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా 100 ఎకరాలకు, 42షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సాగు లక్ష్యాన్ని త్వరలో చేరుకుంటాం. రైతులకు నేరుగా సబ్సిడీ నగదు అకౌంట్లలో జమ అవుతుంది. పాత తోటలను కాపాడుకుంటూ కొత్త తోటల సాగుకు రైతులను సిద్ధం చేయాలని సిబ్బందికి చెబుతుంటాం.

\- శ్రీనివాసరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారి, కడప

9 మండలాల్లో 319ఎకరాల్లో సాగు

ప్రభుత్వం అన్ని రకాలుగా సబ్సిడీలు అందించి మార్కెట్‌లో మంచి ధర వచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నప్పటికి ఆ శాఖ మాత్రం రైతులకు భరోసా ఇవ్వలేదని చెప్పవచ్చు. వైద్యశాఖ, పంచాయతీ రాజ్, ఉపాధి, రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ తదితర శాఖలు అప్పుడప్పుడు గ్రామసభలు, అవగాహన సదస్సులు అంటూ సమావేశాలు నిర్వహిస్తుంటాయి. అయితే పట్టుపరిశ్రమశాఖ మాత్రం ఎక్కడ కనిపించదు. పులివెందుల సెరికల్చర్ శాఖలో నలుగురు అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరంతా పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయాలనే ఆలోచన లేదు. ఎందుకంటే పులివెందుల పరిధిలోని చక్రాయపేట, వేంపల్లె, వేముల, పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, ముద్దనూరు, కొండాపురం, లింగాల మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో కేవలం 319 ఎకరాల్లో మల్బరీ సాగు ఉందంటే సెరికల్చర్ శాఖ పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. రైతులకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారో తెలిసిపోతుంది. ఇదిలా ఉండగా రైతులకు మంజూరయ్యే సబ్సిడీల్లో కొంత డబ్బు సిబ్బందికి అందించాల్సిందేనని చెబుతున్నారు. లేదంటే ఏదో ఒక సాకుతో సమయాన్ని పొడిగిస్తారనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. పులివెందులలో ఉన్న సిబ్బంది ఏనాడు సదస్సులు నిర్వహించరని చెబుతున్నారు.



కడప మీదుగా ప్రత్యేక రైలు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11 : సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (07489/07490) మధ్య కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్స్‌పెక్టరు జనార్దన్ తెలిపారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ప్రత్యేక రైలు నడుపుతున్నామన్నారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9 తేదీల్లో నడుస్తుందని.. అలాగే తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు అక్టోబరు 8, 15, 22, 29, నవంబరు 5, 12 తేదీల్లో నడుపుతున్నామని చెప్పారు. ఈ రైలు కడప-ఎర్రగుంట్లలో స్టాపింగ్ కల్పించడం జరిగిందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్, స్టాంప్ రైటర్‌లపై కేసు నమోదు

కడప(క్రైం), సెప్టెంబరు 11: కడప నగరంలోని ఓ స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లతో రిజి స్టర్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తో పాటు డాక్యుమెంటు రైటర్‌పై కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కడప నగర పరిధిలోని ఓ స్థలానికి సంబంధించి తప్పుడు డాక్యు మెంట్లతో పలువురికి రిజిస్ట్రేషన్ చేయించాడు. ప్రస్తుతం ఆ స్థలాన్ని మొదట కొనుగోలు చేసిన వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రశాంతంగా గ్రేడ్-5 పంచాయతీ సెక్రటరీల బదిలీల కౌన్సిలింగ్

కడప రూరల్, సెప్టెంబర్ 11: పంచాయతీశాఖ పరిధిలోని గ్రేడ్-5 పంచాయతీ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో డీపీవో ప్రభాకర్‌రెడ్డి, ఏవో ఖాదర్ బాషా, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ ప్రసాద్, బద్వేల్ డివిజన్ డీఎల్‌పీవో రమణారెడ్డి తదితరులు బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరై ఉద్యోగుల దరఖాస్తు వివరాలను పరిశీలించారు. బదిలీకి సంబంధించిన అన్‌లైన్ దరఖాస్తుతో పాటు మెడికల్, మ్యూచువల్ తదితర సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. మొత్తం 118 మందికి 116 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు డీపీవో తెలిపారు. కలెక్టర్ అనుమతితో 15న బదిలీల ఉత్తర్వులను అందజేస్తామన్నారు.



కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీపీవో

బైబై గణేశా..

- కోలాహలంగా వినాయకుడి నిమజ్జనం



కడప (కల్చరల్) సెప్టెంబర్ 11: వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొలువుదీరి.. గత ఐదురోజులుగా జిల్లా వ్యాప్తంగా వివిధ కూడళ్లలో పూజలందుకున్న వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలించారు. గణనాధుడి విగ్రహాలను ట్రాక్టర్లలో, లారీలలో ఉంచి డప్పులు, టపాసులు, డీజే సౌండ్ సిస్టమ్స్‌తో నృత్యాలు వేస్తూ యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు, రంగులు చల్లుకుంటూ.. నిమజ్జనం ఆద్యంతం కేరింతల నడుమ ఉత్సాహంగా సాగింది.

సర్దుబాటులో గందరగోళం

ఎంత చేసినా ఉపాధ్యాయుల కొరతే ● జూనియర్లకు ప్రాధాన్యత

● విద్యాశాఖ అధికారులపై ఉపాధ్యాయుల ఆగ్రహం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పని సర్దుబాటు చేపట్టింది. విద్యాశాఖాధికారుల నిర్వాకంతో సర్దుబాటు ప్రక్రియ గందరగోళంగా తయారైంది. దీంతో విద్యాశాఖాధికారులపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 110 ప్రభుత్వ పాఠశాలల్లో 14,320 మంది విద్యార్థులు, దాదాపు 525 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఆగస్టు 19న మండల, డివిజన్ స్థాయిలో పనిసర్దుబాటు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాలు, నేరున్న ఉపాధ్యాయుల మాటే చెల్లుబాటు కావడంతో కొందరు ఉపాధ్యాయులు అనుకున్న పాఠశాలలకు వెళ్లారు. పని సర్దుబాటు జరిగినా దొరసానిపల్లె జడ్పీ హైస్కూలులో ఇద్దరు, మరో జడ్పీ హైస్కూలులో ఒకరు, ఎస్వీజీ బాయిస్ హైస్కూలులో ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉంది. మోడంపల్లె మున్సిపల్ ఉరూ పాఠశాలలో ఇద్దరు, హోమస్‌పేట, శ్రీనివాసనగర్, చౌటపల్లె, మీనాపురం, రాజీవ్‌నగర్, రేగుళ్లపల్లె, తాళ్లమాపురం హరిజనవాడ, ఉప్పరపల్లె, బొజ్జవారిపల్లె, ఈశ్వర్‌రెడ్డినగర్, చెన్నంరాజుపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క ఉపాధ్యాయుల కొరత ఉండగా గోపవరం, ఖాదర్‌బాద్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఒక్కో పాఠశాలలో ముగ్గురు వంతున ఉపాధ్యాయుల కొరత ఉంది. మొత్తం మీద ఉన్నత పాఠశాలలో 6, ప్రాథమిక పాఠశాలలో 19 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యాశాఖాధికారులు సీనియర్ అధికారులను పక్కనబెట్టి జూనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడంతో సీనియర్లు నష్టపోయారు. యూడైస్, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను పనిసర్దుబాటు చేయాల్సి ఉంది. అయితే కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల కోసం డ్రాపౌట్స్ విద్యార్థులను


మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు

పాఠశాలలో నమోదు చేశారు. దీంతో ఆ పాఠశాలలకు అదనంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఫలితంగా మండలంలో 25 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. సర్దుబాటుతో ఉపాధ్యాయులకు శ్రమే తప్ప ఎటువంటి ఉపయోగం లేదని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. పదోన్నతులు ఇవ్వకుండా సర్దుబాటు చేయడం వలన పాఠశాలలకు కూడా ఉపయోగం లేదని పెదవి విరుస్తున్నారు.

అస్తవ్యస్తం



మండలంలో చేపట్టిన సర్దుబాటు అస్తవ్యస్తంగా మారింది. కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయులున్నా కొన్ని పాఠశాలలకు కేటాయించలేదు. సర్దుబాటుతో పాఠశాలలకు ఉపయోగంలేదు. సర్దుబాటుపై అధికారుల తప్పులను ప్రశ్నిస్తే ఆన్‌లైన్ పేరుతో తప్పించుకుంటున్నారు.

సుబ్బరాజు యాదవ్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు : ఆర్డీఓ


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటి, టౌన్ సెప్టెంబరు 11: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని రాయచోటి అర్‌డీఓ రంగస్వామి పేర్కొన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం (1994)పై సబ్ డివిజనల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ సమావేశంలో జిల్లా పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ గత సమావేశం మినిట్స్‌పై చేపట్టిన చర్యలపై డివిజన్‌లో ఫారం ఎఫ్ ఆన్‌లైన్‌లో మూడు నెలలుగా అప్‌లోడ్ చేయని 13 స్కానింగ్ సెంటర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఐదు సెంటర్ల యాజమాన్యం నోటీసులకు కారణాలను వివరిస్తూ డిస్ట్రిక్ట్ అథారిటీకి వివరణ ఇచ్చారన్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ షోకాజ్ నోటీసుకు జవాబు ఇవ్వని స్కానింగ్ సెంటర్లకు రూ.20,000 జరిమానా విధిస్తామన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం కమిటీ మెంబర్లు సురేంద్రారెడ్డి, నాగేశ్వర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నిస్సార్ అహ్మద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, ఉషారాణి, సుగుణ, పోలీసు శాఖ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్'


పిల్లల తల్లులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

సిద్దవటం, సెప్టెంబరు 11: గర్భిణులు పౌష్టికాహారం తినడంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని కడప జిల్లా వైద్యాధికారి నాగరాజు సూచించారు. మాధవరం పంచాయతీ రామకృష్ణాపురం అంగన్వాడీ స్కూల్లో జరుగుతున్న పోషక అభియాన్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పోషణ అభియాన్ కార్యక్రమం సెప్టెంబరు చివరి వరకు జరుగుతుందన్నారు. గర్భిణులు ఆకు కూరలు, పాలు, గుడ్లు బాగా తీసుకోవాలని ఆయన సూచించారు. పోషక అభియాన్ కార్యక్రమానికి సూపర్‌వైజర్ రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంసీహెచ్ కార్డులో వ్యాక్సినేషన్ గర్భిణులకు ఇచ్చినప్పుడు తప్పకుండా నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకుమార్, ఎంపీహెచ్ఓ నాగవల్లి, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ - ఒకరి మృతి


సుదర్శన్‌రెడ్డి మృతదేహం

జమ్మలమడుగు, సెప్టెంబరు 11: దేవగుడి బైపాస్ రోడ్డుపై బుధవారం ఉదయాన్నే ట్రాక్టర్ స్కూటర్‌ను ఢీకొనడంతో పోచిరెడ్డిగారి అబ్బెన్నగారి సుదర్శన్‌రెడ్డి (41) మృతిచెందగా బీటెక్ విద్యార్థి కాసేంద్రారెడ్డికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు స్థానిక నాగులకట్ట వీధి వాసులు సుదర్శన్‌రెడ్డి వ్యవసాయంతో జీవిస్తున్నాడు. అయితే సమీప బంధువు కాసేంద్రారెడ్డిని కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో చేర్పేందుకు ఇద్దరూ బైక్‌పై కలికిరికి బయలు దేరారు. వీరు ప్రొద్దుటూరు మీదుగా వెళ్లాలని తెల్లవారుజామునే బయలుదేరారు. కాగా దేవగుడి నుంచి వస్తున్న ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొనడంతో సుదర్శన్‌రెడ్డికి తీవ్ర గాయాలపాలుకాగా, విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జమ్మలమడుగుకు తీసుకొచ్చారు. విషమ పరిస్థితిలో ఉన్న సుదర్శన్‌రెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాలవైపు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. స్వల్పంగా గాయపడిన కాసేంద్రారెడ్డి జమ్మలమడుగు క్యాంబెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య ఉదయ, పెద్దకుమారుడు పోచిరెడ్డి 10వ తరగతి, రెండో కుమారుడు సందీప్ 8వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను, ద్విచక్ర వాహనాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మురళీయాదవ్ తెలిపారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే చేపట్టాలి

ప్రైవేట్‌కు అప్పగిస్తే ఆందోళనలకు సిద్ధం : కౌన్సిలర్లు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 11: పులివెందులలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నడపాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పులివెందుల ఆర్డీఓ వెంకటేశులును కలిసి వినతిపత్రం సమర్పించిన చైర్మన్ మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. ఇప్పటికే 50సీట్లకు అనుమతి ఇచ్చినా ప్రభుత్వం తీసుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం అందించాలనే ఉద్దేశంతో పులివెందులకు మెడికల్ కళాశాలను నెలకొల్పారని వివరించారు. ప్రైవేట్‌పరం చేసేందుకు ముందుకెళ్తే ఆందోళనలకు సిద్ధమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కిషోర్, గండి రాము, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైవీయూలో ఘర్షణ - విద్యార్థికి గాయాలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: వైవీయూలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. బుధవారం ఉదయం వైవీయూలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యార్థి స్వామి తన వైపు కోపంగా చూశాడని మైక్రోబయాలజీ విద్యార్థి సురేష్ తన చేతిలో ఉన్న ప్లేటుతో అతన్ని కొట్టాడు. వెంటనే స్వామి క్యాంపస్ హాస్టల్‌కెళ్లి తోటితో కలిసి వచ్చి సురేశ్‌పై స్టీలురైలింగ్‌తో దాడి చేశారు. దీంతో అతని తలకు గాయమైంది. విషయం తెలియగానే వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కె.క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ విద్యార్థులతో సంఘటనకు గల కారణాలు రాబట్టి విషయాన్ని పోలీసులకు చేరవేశారు. గాయపడిన విద్యార్థికి యూనివర్శిటీలో వైద్యసేవలు చేయించారు. వైవీయూ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనుకోకుండా జరిగిన సంఘటన అని, గతంలో వీరిద్దరి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటపలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు., పెండ్లిమర్రి సీఐ చల్లనిదొర సిబ్బందితో హుటాహుటిన యూనివర్శిటీకి వచ్చి సంఘటనకు గల కారణాలు ఆరా తీశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అండర్-14 క్రికెట్ సెలక్షన్స్‌కు అనూహ్య స్పందన

250 మందికి పైగా హాజరు - 90 మంది ఎంపిక

కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 11: జిల్లా క్రికెట్ సంఘం సారధ్యంలో బుధవారం రిమ్స్ సమీప వైఎస్‌రాజారెడ్డి ఏసీఏక్రికెట్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 సెలక్షన్స్‌కు యువ క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 250 మందికి పైగా క్రీడాకారులు హాజరవగా 90 మందిని ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 13వ తేదీ శుక్రవారం మూడు మైదానాల్లో ప్రాబబుల్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్టుగా ఎంపిక చేసి వారితో జిల్లాకు ఆడిస్తామని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ ఫలితాలు విడుదల


పీజీ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టరు ఫలితాలను వీసీ ప్రొఫెసరు కిష్టారెడ్డి, రిజిస్ట్రారు రఘునాధరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి బుధవారం తన ఛాంబరులో విడుదల చేశారు. ఎమ్మెస్సీ బోటనీ, బయో కెమిస్ట్రీ, జియాలజీ, బయోటెక్నాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, జెనిటిక్స్ అండ్ జునోమిక్స్ సైకాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఎంఏ తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ ఎకనామిక్స్, ఎంకామ్, కామర్స్, ఉర్దూ 100 శాతం ఫలితాలు రాగా జువాలజీ 94, మేథమేటిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్ 90, కెమిస్ట్రీ 42 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టరు, మూడేళ్ల ఎల్ఎల్‌బీ తొలి సెమిస్టరు ఫలితాలను విడుదలచేశారు. శ్రీనివాసరావు, గంగయ్య, మమత పాల్గొన్నారు.

శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11: కడప నగరం ఉక్కాయపల్లె పంచాయతీలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు పదేళ్లకు అటానమస్ హోదా ఇచ్చినట్లు చైర్మన్ జి.శ్రీనివాసులు సమక్షంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజ కళాశాల సిబ్బందికి తెలియజేశారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఢిల్లీ కేంద్రంగా పనిచేసే యూజీసీ, ఎస్ఐటీఎస్‌లోని ఉన్నతమైన విద్యాప్రమాణాలను విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు సాంకేతిక విద్య యూనివర్శిటీ గ్రాంటు కమిషన్ న్యూఢిల్లీ గుర్తించి అటానమస్ హోదా ఇచ్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమయ్యే అన్నిసదుపాయాలు సమకూర్చే చైర్మన్ విద్యార్థులను సాంకేతిక నైపుణ్యవంతులుగా మార్చడానికి పాటుపడే ఆయా విభాగాల అధిపతులు అధ్యాపకుల ద్వారా కళాశాలకు గతేడాది నాస్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని ఈ ఏడాది నుంచి రాబోయే పదేళ్లకు అటానమస్ హోదా వచ్చిందన్నారు.

కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 11: అప్పాయపల్లె పొలాల్లో బుధవారం కరెంటు షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. చదిపిరాళ్ల రైతు రఘురాం కాడెద్దుల ద్వారా కుటంబాన్ని పోషించుకునేవాడు. తెల్లవారుజామున ఇసుక తోలేందుకు పాపాఘ్నినదిలోకి వెళ్లాడు. నది నుంచి ఇసుక తోలుతుండగా దారిలో నీళ్లున్న ప్రాంతంలోనే ట్రాన్స్‌ఫార్మరు ద్వారా భూమికి కరెంటు సరఫరా అవుతోంది అది గమనించని రైతు ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా నీటిలో దిగగానే షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది.

బైకు బోల్తా - ఇద్దరికి గాయాలు

ముద్దనూరు సెప్టెంబరు11: మునయ్యకోన వద్ద బుధవారం ఉదయం బైకు అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన ఇర్ఫాన్, ఇస్మాయిల్ ముద్దనూరుకు వస్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. వారిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిపై దాడి - కేసు నమోదు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 11: మనస్పర్థలతో బీటెక్ విద్యార్థి ఊటుకూరు తరుణ్ కుమార్‌రెడ్డిపై దాడి జరిగింది. మైదుకూరు ఉప మండలాధ్యక్షుడు రఘురామిరెడ్డి ఇంటి వద్దకు జీవీ సత్రంకు చెందిన కదీర్, ఉప్పుకుంటపల్లెకు చెందిన శివ వెళ్లి తరుణ్‌పై దాడి చేశారు. తరుణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ సయ్యద్ హసం తెలిపారు.

బాలిక అప్పగింత

కడప (క్రైం), సెప్టెంబరు 11: కడప నగరం చలమారెడ్డిపల్లెకు చెందిన బాలిక అర్ధరాత్రి నుంచి కన్పించడంలేదు. దీంతో కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. రిమ్స్ ఎస్ఐ జయరాములు తన సిబ్బందితో బాలిక కోసం గాలించారు. గంటల వ్యవధిలోనే బాలికను గుర్తించి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి తగు జాగ్రత్తలు చెప్పి పంపించారు.

గండికోట లోగో డిజైన్,టాగ్ లైన్ రూపకల్పన పోటీలు

22 లోగా దరఖాస్తులు పంపాలి : కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు11: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని 27న గండికోట పర్యాటక కేంద్రంలో నిర్వహించే ఉత్సవాల లోగో డిజైన్,టాగ్ లైన్ రూపకల్పన పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ ఆఫీసరు సురేష్‌కుమార్ సంబంధిత అధికారులతో కలిసి గండికోట అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ 27న గండికోట ఉత్సవాలను జిల్లా యంత్రాంగం నిర్వహించనుందన్నారు. అందులో భాగంగా గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. గండికోట వారసత్వం, సంస్కృతిని ప్రతి బించేలా ప్రత్యేకమైన, సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌ను రూపొందించడం కోసం ధరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఉత్తమ లోగోకు రూ. 25 వేలు, ఆంగ్లంలో అత్యంత ఆకర్షణీయమైన టాగ్ లైన్‌కు రూ.15 వేలు నగదు బహుమతిని ప్రకటించామన్నారు. అభ్యర్థులు తమ పేరు, మొబైల్ నెంబరుతో ఎంట్రీలను ఈ మెయిల్ ఐడి విజిట్ గండికోట. జీ మెయిల్ డాట్ కమ్‌కు సెప్టెంబరు 22 వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు. అదనపు సమాచారం కోసం ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, ఫేస్ బుక్‌లో విజిట్ గండికోట పేజీలను ఫాలో అవ్వాలన్నారు. పర్యాటక దినోత్సవాల్లో భాగంగా గండికోట పర్యటక కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటకం, వినోదం ప్రభుత్వానికి ఆదాయాన్ని ఇచ్చే వనరుగా ఉపయోగపడాలన్నారు. పోలీసు, రెవెన్యూ, టూరిజం శాఖల సమన్వయంతో పర్యాటకులకు సంతృప్తికర ఏర్పాట్లను సమకూర్చాలన్నారు. ఆర్కియాలజీ, మైన్స్ శాఖల ఆధ్వర్యంలో గండికోట జియోలజికల్ ప్రాశస్త్యాన్ని వివరించేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లల వినోదం కోసం ప్లే జోన్ ఏర్పాటు చేయాలన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం

- అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శైలజ



విజేతలకు బహుమతులు అందిస్తున్న అడిషినల్ డాక్టర్ శైలజ, మార్ల ఓబుల్‌రెడ్డి తదితరులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 11: అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అదనపు అధికారి డాక్టర్ శైలజ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు డైట్ కళాశాలలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సుకు వచ్చిన విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి మీద అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. క్విజ్ పోటీలు, మారథాన్ వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎయిడ్స్, సాధారణ ఆరోగ్యం, రుతుస్రావ చక్రము, ఆరోగ్యకర ఆహారము, స్వచ్ఛంద రక్తదానం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. డైట్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి మాట్లాడారు. క్విజ్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన సంబేపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థులు రుక్సానా, రుక్సార్‌కు రూ.5 వేలు నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన పెద్దివీడు రెడ్డివారిపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థులు సుధారాణి, అశ్వితకు రూ.4 వేలు, తృతీయ స్థానం సాధించిన మాసాపేట జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఆయేషా, సాయిశ్రీలకు రూ.3 వేలు నగదు బహుమతి ప్రశంసా పత్రాలను అందించామన్నారు. జిల్లా విజేతలు 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీహైదర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఆఫ్ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, జిల్లా రిసోర్స్ పర్సన్ అల్లావలి, ప్రాజెక్టు సిబ్బంది స్వాతి, సాధిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 11: పక్కాగృహాల నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వేకోడూరు ఇన్‌ఛార్జ్ హౌసింగ్ శాఖ డీఈఈ మురళీక్రిష్ణ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు హౌసింగ్ శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట మండలాలకు గత ప్రభుత్వంలో మొత్తం 2616 పట్టాలు, ఉర్లగట్టుపోడులో 178 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అప్పటి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్ అధికారుల సమక్షంలో ఇళ్లు నిర్మించే మేస్త్రీలు, లబ్ధిదారులకు మధ్య ఒప్పందం కుదిర్చినట్లు తెలిపారు. మేస్త్రీలు శ్లాబు పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వం వారు మంజూరు చేసిన బిల్లులు లబ్ధిదారుల అకౌంటులో పడుతుందన్నారు. పడిన బిల్లులను లబ్ధిదారులు మేస్త్రీలకు ఇవ్వాలనే ఒప్పందమన్నారు. మేస్త్రీలు పని పూర్తి చేసిన తర్వాత కొందరు లబ్ధిదారులు మేస్త్రీలకు డబ్బు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం నుంచి డబ్బు లబ్ధిదారులకు పడ్డాయని, పెండింగ్‌లో లేవన్నారు. మేస్త్రీలకు సుమారు లబ్ధిదారుల నుంచి రూ. 10 లక్షలు డబ్బులు రావాల్సి ఉందన్నారు.

కారు చోరీ కేసులో నిందితులు అరెస్టు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 11: కారు దొంగతనం కేసులో నిందితులు రామ్‌నాథరెడ్డి, హరిక్రిష్ణారెడ్డిని అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. వై.కోడూరు గ్రామంలో సిరిగిరెడ్డి శివారెడ్డి కల్లంలో కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లింగాలదినెపల్లెలో సెప్టెంబరు 7న కారు చోరీ జరిగిందని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మైదుకూరు రూరల్ సీఐ పర్యవేక్షణలో బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా ఎర్రగుంట్ల మండలం వై.కోడూరులో శివారెడ్డి కల్లందొడ్డిలో దాచిన కారును బుధవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి ఉయోగించిన పల్సర్ బైకు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ విలేకరులకు తెలిపారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీ లెక్కింపు

కడప (కల్చరల్) సెప్టెంబరు 11: రాజరాజేశ్వరీ దేవి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. మార్చి 27వ తేదీ నుంచి అమ్మవారికి కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం రూ. 1,25,272గా నిర్ధారించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కడప ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్, అర్చకులు పాల్గొన్నారు.

చెర్లోపల్లెవాసి కువైత్‌లో మృతి



అట్లూరు, సెప్టెంబరు 11: చెర్లోపల్లె వాసి జమ్మన సుబ్బ నరసారెడ్డి (50) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో మరణించినట్లు అతని బంధువులు తెలిపారు. సుబ్బనరసారెడ్డి కువైత్‌లో బిల్డింగు పనిచేసేవాడని, మంగళవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతనికి భార్య యశోదమ్మ ఒక కొడుకు, కూతురు ఉన్నారు. సుబ్బ నరసారెడ్డి మృతదేహాన్ని సొంతూరుకు తరలిస్తున్నట్లు అతని బంధువులు తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 11: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం మైలవరం నుంచి పెన్నాకు 2000 క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 120 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 120 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 4.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

నర్సు శిక్షకులకు జపాన్ భాషపై శిక్షణ

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 11: రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో బీఎస్సీ నర్సింగ్ చేసిన విద్యార్థులకు జపనీస్ భాషపై శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిక్రిష్ణ తెలిపారు. ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిలో జపనీస్ భాష నేర్పించి జపాన్ దేశంలో నర్సులుగా ఉద్యోగం పొందేందుకు దరఖాస్తులు పంపనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం అర్హులకు జపాన్ దేశంలో నెలకి రూ.1,00,000 నుంచి 1,40,000 వరకు జీతంతో ఉద్యోగం పొందే అవకాశం వుంటుందన్నారు. వివరాల కోసం 7981972887ను సంప్రదించాల్సి వుంటుందని ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి స్వాధీనం - ఒకరు అరెస్ట్

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 11: జేఆర్ రవీంద్ర నగర్‌లో 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సయ్యద్ హసం విలేకరులకు తెలిపారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు కొరిగం శ్రీను తన పాత ఇంట్లో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

కోలాహలంగా వినాయకుడి నిమజ్జనం




కడప నగరంలో వినాయకుడి వద్ద సంప్రదాయ దుస్తులతో భక్తులు.. దేవుని కడప చెరువులో గణేశ్ నిమజ్జనం

కడప (కల్చరల్) సెప్టెంబరు 11: వినాయక చవితి పర్వదినం సందర్భంగా గత ఐదు రోజులుగా పూజలందుకున్న వినాయకుడి విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరలించారు. గణనాధుడి విగ్రహాలను ట్రాక్టర్లలో, లారీలలో ఉంచి డప్పులు, టపాకాయలు, డీజే సౌండ్ సిస్టమ్స్‌తో నృత్యాలు చేసూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించారు. దేవునికడప చెరువు, , ఆలంఖాన్‌పల్లె వద్ద గల కేసీ కాల్వనీటిలో నిమజ్జనం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం, చెక్కభజనతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రాజీవ్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి భారీ విగ్రహంతో పాటు బాలాజీనగర్‌లోని తారకరామనగర్‌లో, 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ ఖాజా పీర్ పాల్గొన్నారు. యర్రముక్కపల్లె నుంచి భారీ వినాయకుడి విగ్రహం ఊరేగింపుగా, దేవునికడప చెరువు, ఆలంఖాన్‌పల్లె వద్ద గల కేసీ కెనాల్‌లో నిమజ్జనం గావించారు. కడప నగరం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె కాలనీలో రాణితోట వీధి, మసీదు వెనుక గత ఐదు రోజులుగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలకు నిర్వాహకులు పూజలు నిర్వహించారు.

చెన్నూరు: వినాయకుడి విగ్రహాలను స్థానిక పెన్నానదిలో నిమజ్జనం చేశారు. అంతకుముందు వీధివీధినా ఊరేగింపు నిర్వహిస్తూ మంగళవాయిద్యాలు, టపాసులు పేల్చుతూ యువత డ్యాన్స్‌లు వేశారు. చెన్నూరు శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డూకు 15 మంది పోటాపోటీగా కొండపేటకు చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, రూ.50 వేలకు దక్కించుకున్నారు.

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండలంలో గణేష్ నిమజ్జనాలు 5వ రోజు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూను వేలంపాట నిర్వహించి అన్నదానాలు ఏర్పాటు చేశారు.



కడప: వొడేశ్వరీదేవి విగ్రహం వద్ద ఊరేగింపు



చెన్నూరు: లడ్డును దక్కించుకున్న మోహన్‌రెడ్డి



జర్నలిస్ట్స్ ఆచారి కాలనీల మధ్య ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డును దక్కించుకున్న నరసింహులు



ఆలంఖాన్‌పల్లెలో అన్నదానం



వేంపల్లెలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



దేవుని కడపలో నృత్యం చేస్తున్న మహిళలు

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 11 : డీఈఓ కార్యాలయ సిబ్బందిపై ఈ నెల 4న ఎస్టీఎఫ్ యూనియన్ నాయకులు దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డీఈఓ కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేశారు బుధవారం ఆర్‌జేడీ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4న డీఈవో కార్యాలయంలో ఎస్టీఎఫ్ నాయకులు రామాంజనేయులు, ఆవుల శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, బాలక్రిష్ణ తదితరులు కార్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందిపై దాడికి పాల్పడ్డారన్నారు. దీనిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు ఎం.రమేశ్, కార్యదర్శి సాయి ఫణీంద్ర, క్యాంపు క్లర్కు ప్రవీణ్, ఉపవిద్యాధికారి క్యాంపు క్లర్క్ క్రిష్ణారెడ్డితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

సీకేదిన్నె, సెప్టెంబరు 11: చింతకొమ్మదిన్నె మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులకు గురువారం ఎస్‌జీఎఫ్ఐ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల క్రీడల కో ఆర్డినేటర్ రుద్రమూర్తి యాదవ్ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె జడ్పీ హైస్కూలులో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఉదయం 10 గంటలకు ఖోఖో, కబడ్డీ, యోగా, వాలీబాల్, చెస్ తదితర క్రీడాంశాలపై చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

వరద బాధితులకు సర్వే శాఖ సాయం

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా భూములు, కొలతల శాఖ ఆధ్వర్యంలో రూ.45 వేలు చెక్ రూపంలో సర్వే శాఖ ఏడీ మురళీకృష్ణ బుధవారం కలెక్టర్ శివశంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

సింహాద్రిపురం, సెప్టెంబరు 11: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు గురిజాల జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓ 1 ఓబులేసు, ఎంఈఓ 2 శారద, హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ 14,17 విభాగాలలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చదరంగం, అథ్లెటిక్ పోటీలు, సెలెక్షన్స్ ఉంటాయని ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ పీడీ విక్టర్ తెలిపారు. అన్ని పాఠశాలల పీడీ, పీఈటీలు అర్హత గల క్రీడాకారుల జాబితా, మధ్యాహ్న భోజన అక్విటెన్స్ తప్పక తీసుకురావాలని కో ఆర్డినేటర్ విక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అన్ని పాఠశాలల క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్ విక్టర్ కోరారు.

టీకా నిల్వ కేంద్రం పరిశీలన

లింగాల,సెప్టెంబరు 11: మండలంలోని వెలిదండ్ల ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకా కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ ఎ.ఉమామహేశ్వరకుమార్ తనిఖీ చేశారు. బుధవారం లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిపరిశీలించిన అనంతరం వెలిదండ్ల కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేశారు, సిబ్బంది సూచనలు సలహాలు ఇచ్చారు. మండలంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలుగురించి వైద్యాధికారి డాక్టర్ సి.కళ్యాణ్‌దినకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ మొయినుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్త కె.నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బండి జకరయ్య



కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 11: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి సమక్షంలో పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య విజయవాడలో జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పౌష్టికాహార విలువలపై అవగాహన కలిగి ఉండాలి

లింగాల, సెప్టెంబరు 11: పౌష్టికాహార విలువలపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ సూపర్వైజర్ కుసుమకుమారి సూచించారు. బుధవారం మండలంలోని పార్నపల్లెలో పోషణ్ అభియాన్ మాసోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు తదితర వాటిని చూపుతూ పోషక శాతాన్ని వివరించారు. ఏ సమయంలో ఏ ఆహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. కావున ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్, పీహెచ్ఎన్, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో గులాబి రంగు పురుగు నివారణ ఇలా...

పులివెందుల, సెప్టెంబరు 11: ప్రస్తుతం సాగులో ఉన్న పత్తిపంటలో గులాబి రంగు పురుగు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త భాగవతిప్రియ అన్నారు. బుధవారం తొండూరు మండలంలోని భద్రంపల్లె, తొండూరు గ్రామాలలో ముద్దనూరు ఏడీఏ వెంకటసుబ్బయ్య, తొండూరు వ్యవసాయాధికారి మధుసూధన్‌రెడ్డితో కలిసి పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గులాబి రంగు పురుగు నిఘా కోసం లింగాకర్షక బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజు లు 8 పురుగులనుగమనించినా, గుడ్డి పువ్వుల సంఖ్య ఎక్కువగా ఉన్న, 20 కాయలను గమనించినపుడు రెండు గొంగళి పురుగులున్న వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పలు ఎరువులు, పురుగుమందులను సూచించారు. ఏఓ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ పంటనమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ-కేవైసీ పూర్తిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్ర ఏఓ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మహిళా పెరటి తోటలు పెంచాలి

పెండ్లిమర్రి, సెప్టెంబరు 11: ప్రతి మహిళ ఇంటి వద్ద పెరటి తోటలు పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి సలహా ఇచ్చారు. బుధవారం పెండ్లిమర్రి మండల సమాఖ్యలో ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు, వాతావరణం నెలకొని ఉంటుందన్నారు. ఇప్పటికే రసాయన ఎరువుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నేల స్వభావం కోల్పోతోందన్నారు. దీన్ని అరికట్టాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరావు, సందీప్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఈ-కేవైసీ తప్పక చేయించుకోవాలి

వేముల, సెప్టెంబరు 11: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఈ-కేవైసీ చేయంచుకోవాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని నల్లచెరువుపల్లె, చాగలేరు రైతు సేవా కేంద్రాలను సందర్శించి ఈ-కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకు న్న రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తించే అవకాశం ఉందన్నారు. కావున రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాలలో యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అసిస్టెంట్‌లు నాగసుధ, లలిత పాల్గొన్నారు.

నష్టపోయిన కొండయ్యను ప్రభుత్వం ఆదుకోవాలి

చక్రాయపేట, సెప్టెంబరు 11: పాకలో ఉన్న గొర్రెలను వీధికుక్కలు దాడి చేసి చంపడంతో తీవ్రంగా నష్టపోయిన గొర్రెల కాపరి కొండయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ కోరారు. బుధవారం దేవరగుట్టపల్లెలోని సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కల దాడిలో సుమారు 20గొర్రెలు మృత్యువాతపడడంతో పాటు మరో 9 గొర్రెలకు తీవ్రంగా గాయపడ్డాయన్నారు. ఈ దాడిలో దాదాపు రూ.3లక్షలకుపైబడి నష్టం జరగడంతో గొర్రెల పెంపకంపైన ఆధారపడి జీవిస్తున్న కొండయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దార్, ఎంపీడీఓ, వెటర్నరీ డాక్టర్‌లు సత్వరం చర్యలు చేపట్టి బాధితుడిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు బుర్రిరెడ్డయ్యయాదవ్, ప్రధానకార్యదర్శి తెల్లదారుల విజయ్‌కుమార్ యాదవ్, మల్లికార్జునయాదవ్, శ్రీనివాసులుయాదవ్ తదితరులుపాల్గొన్నారు.

కండక్టర్లు- డ్రైవర్లకు ఫిక్స్‌డ్ చార్ట్‌లు వేయాలి

- ఒకరోజు రిలే దీక్షలో ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలు

కడప (కల్చరల్), సెప్టెంబరు 11: ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో పెండింగ్‌లో వున్న కడప, మైదుకూరు, బద్వేల్ డిపోల్లో నూతన కండక్టర్ల, డ్రైవర్ల ఫిక్స్‌డ్ చార్ట్‌లు వేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. రీజియన్ వ్యాప్తంగా అపరిష్కృతంగా వున్న ఉద్యోగు ల సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఎన్ఎంయూఏ కడప రీజనల్ కమిటీ పిలుపుమేరకు బుధవారం ఆర్ఎం కార్యాల యం ఎదుట ఒకరోజు రిలే దీక్ష చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, కడప డిపో అధ్యక్షుడు జయరా మ్, కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల్లో ఎన్ఓ అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలతో అధికార దుర్వినియోగంతో అక్రమ రికవరీలు చేస్తూ ఉద్యోగులను వేధిస్తున్న జమ్మలమడుగు డిపో మేనేజర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్క్యులర్ నిబంధనల మేరకు స్పేర్ సిబ్బందికి బలవంతపు సెలవులను వేయడం మానేసి పాయింట్లలో వాడుకునేందుకు మస్ట ర్ ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. అవసరనిమిత్తం అర్హత మే రకు మహిళలకు చైల్డ్‌కేర్ లీవులు మంజూరు చేయాలన్నారు. హయ్యర్ క్వాలిఫికేషన్ పేరిట గ్యారేజీ కార్మికులకు నిలుపుదల చేసిన 12, 18, 24 ఏళ్ల ఏఏఎస్ ఇంక్రిమెంట్లను వెంటనే కలపాలన్నారు. గ్యారేజీ కార్మికులకు సరైన టూల్స్ మెటీరియ ల్స్ తెప్పించి వాహనాల కండీషన్‌ను మెరుగుపరచాలన్నారు. ఇప్పటికైనా స్పందించక పోతే కలెక్టర్‌ను కలిసి మెమొరాండం సమర్పించి తదుపరి కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. దీక్షలో కడప డిపో డ్రైవర్లు రామచంద్ర, సీఎస్‌రెడ్డి కూర్చున్నారు. కార్యక్రమంలో కడప డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎస్.ఖాన్, గ్యారేజీ కార్యదర్శి మల్లేష్ తదదితరులు పాల్గొన్నారు.

కందిలో చీడపీడలను తరిమేయండి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 11:కంది పంటలో తిష్టవేసిన చీడపీడలను తరిమేయాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఇందుకూరు గ్రామంలో సాగులో ఉన్నకంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎకరానికి లీటర్ చొప్పున వేపనూనె పిచికారీ చేసుకుంటే 15 నుంచి 20 రోజుల వరకు చీడపీడల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. అలాగే గంగిరెడ్డిపల్లెలో ఈ-కేవైసీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం



పోరుమామిళ్ల... వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న వెంకటరమణ





జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కొండాపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు

కొండాపురం, సెప్టెంబరు 11 : పట్టణంలోని సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద కొలువుదీరిన 18 అడుగుల భారీ గణనాథుని నిమజ్జనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.మండలంలోనే ప్రధానమైన విగ్రహం కావడంతో నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో, డప్పు వాయిద్యాల మధ్య, టపాసులు పేల్చుతూ, రంగులు చల్లుకుంటూ గణనాథుని గ్రామోత్సవం నిర్వహించారు. కిరాణా మర్చంట్ సత్రసాల రాఘవేంద్ర రూ.62,500కు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు.అనంతరం గండికోట బ్యాక్‌వాటర్‌లో నిమజ్జనం చేశారు. కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ బందోబస్తు నిర్వహించారు.

కాశినాయన..: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన బుధవారం నర్సాపురంలో వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మీసేవా సమీపంలోని మండపంలో లడ్డూను శివ రూ.34000 ,కలశం రూ. 54000, అంజనేయస్వామి గుడివద్ద లడ్డూను ఎం.సుబ్బారెడ్డి రూ.35000, కలశం గుండం రాజారెడ్డి రూ.70000, కలశబండ సెంటర్‌లో లడ్డూను మోరే వీరయ్య రూ.40000 వేలం పాటపాడి దక్కించుకున్నారు.

జమ్మలమడుగు..: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని 5వ రోజు బుధవారం మధ్యాహ్నం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మండలంలోని మోరగుడి గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన ఐశ్వరయ్య గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం జరిగింది. కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటం, టపాసులు పేల్చి రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. అలాగే పట్టణంలోని మూడు రోడ్ల కూడలి వద్ద నుంచి రామిరెడ్డిపల్లె దారిలో అన్ని వీధుల్లో విగ్రహాలను తరలించారు. జమ్మలమడుగు గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ, పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, కన్నెలూరు, ఎత్తపువారి కాలనీ, బీసీ కాలనీ, తదితర ప్రాంతాల నుంచి భారీగా గణేశ్ విగ్రహాలు తరలి వెళ్లాయి.

ఖాజీపేట..: మండల పరిధిలో వినాయక విగ్రహాలకు అయిదు రోజులపాటు ఘనంగా పూజలు చేసి బుధవారం అన్నదానం నిర్వహించి ఆయా గ్రామస్థులు నిమజ్జనానికి తరలించారు. భారీగా పటాసులు పేల్చుతూ మంగళవాయిద్యాల మధ్య నిమజ్జనానికి వినాయకుడిని తరలించారు. మండల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.కాగా మండల పరిధిలోని దుంపలగట్టులో వినాయకుని లడ్డూను రూ.92 వేలకు ఆ గ్రామానికి చెందిన తవ్వా కిశోర్‌కుమార్‌రెడ్డిదక్కించుకున్నారు.

ముద్దనూరు..:మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు బుధవారం నిమజ్జనానికి బయలుదేరి వెళ్లాయి. డప్పు, వాయిద్యాల మధ్య రంగులు జల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. మాజీ ఎంపీటీసీ,మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్ ఉమాదేవి, గురుట్రాన్స్ పోర్టు అధినేత గురప్ప ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రొద్దుటూరు టౌన్..: పట్టణంలో వినాయకుని నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలు, బ్యాండు మేళం, టపాసులతో స్వామివారిని నిమజ్జనానికి తరలించారు. కామనూరు, చాపాడు, థర్మల్ రోడ్డులో నిమజ్జనాలు కొనసాగుతున్నాయి.

పోరుమామిళ్ల..:వినాయకచవితి పండుగ సందర్భంగా బలిజకోటలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను చెన్నువెంకటరమణ రూ.49వేలుకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే శీనప్పబావివీధిలో 300 కేజీల లడ్డును బావునూరి వెంకటేశ్ రూ.21వేలకు దక్కించుకున్నారు. బుధవారం పోరుమామిళ్లలో గణేశ్ నిమజ్జనం నిర్వహించారు. ఐదోరోజు మల్లకతవ వద్ద మిగిలిన గణేశ్ విగ్రహాలన్నింటినీ మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. సర్పంచ్ యనమల సుధాకర్ మల్లకతవ వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు.

అట్లూరు..: మండలంలోని ఎస్.వెంకటాపురం, ముత్తుకూరు అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద వివిధ గ్రామాల్లోని 16 గణేశ్ విగ్రహాలను కమిటీ సభ్యులు నిమజ్జనానికి తరలిస్తున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. ముతుకూరు గ్రామంలో ఆవుల నాగరాజు గణేశ్ లడ్డూను రూ.49వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు.

బద్వేలుటౌన్..: వినాయకచవితిని పురస్కరించుకొని నాలుగురోడ్లకూడలి ఆర్యవైశ్య వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ధి వినాయకుడిని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రితేష్‌కుమార్‌రెడ్డిని ఆర్యవైశ్యులు శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు వెంగల్‌రెడ్డి శివయ్యస్వామి, సుబ్బరామయ్య, కనుమల్లపూడి ప్రసాద్, మిత్తికాయల రమణ, సునీల్‌కుమార్, కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం పట్టణంలోని గాండ్లవీధి, పప్పులవీధి, దూదేకులవీధి, మిద్దెవారిపాలెం పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను కోలాహలంగా తరలించారు. నిమజ్జనం వెంట కోలాటం, చెక్కభజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అర్బన్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో పటిష్టబందోబస్తు నిర్వహించారు.

మైదుకూరు రూరల్..:గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా విగ్రహాలు కుందూనది వైపు నిమజ్జనానికి పయనమయ్యాయి. బాణసంచామధ్య రంగులు చల్లుకుంటు ఘనంగా గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్లారు.

బ్రహ్మంగారిమఠం..:మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ప్రాంగణంలో వెలసిన బొజ్జగణపయ్యను బుధవారం అంగరంగ వైభవంగా కమిటి సభ్యులు గ్రామోత్సవం చేపట్టారు. డప్పువాయిద్యాలు మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజుపాలెం..: వాడవాడలా కొలువైనగణనాథులు ఐదురోజులపాటు పూజలందుకుని నిమజ్జనానికి తరలివెళ్లారు. యువకులంతా గణేశ్ ఉత్సవాల్లో పాలు పంచుకన్నారు. వివిధ గ్రామాల్లో లడ్డూ వేలం పాట నిర్వహించారు. వెంగలాయపల్లె గ్రామంలో ఉప్పలూరు క్రిష్టారెడ్డి అనే రైతు లడ్డూను రూ.60వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. నిమజ్జనానికి ఏర్పాటు చేసిన వెల్లాల బ్రిడ్జి, టంగుటూరు, వెలవలి, కూలూరు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్‌ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు పికెట్‌తో పాటు రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.



అట్లూరు... వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న నాగరాజు



బద్వేలు... నాలుగురోడ్లకూడలిలో వరసిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్‌రెడ్డి



బద్వేలు...గాండ్లవీధి వినాయక నిమజ్జనంలో పాల్గొన్న యువకులు



ఖాజీపేట.. దుంపలగట్టులో లడ్డూను తీసుకెళుతున్న మహిళ



బి.మఠం.. గ్రామోత్సవంలో గణపయ్య



మద్దనూరులో అన్నదాన కార్యక్రమం చేస్తున్న దృశ్యం

శాస్త్రీయసమాజ నిర్మాణమే జేవీవీ ధ్యేయం

కాశినాయన సెప్టెంబరు11: శాస్త్రీయ సమాజ నిర్మాణమే ధ్యేయంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తోందని ఏపీ ప్రభుత్వ మోడల్‌పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.చంద్ర, జేవీవీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ ఆచారి పేర్కొన్నారు.బుధవారం నర్సాపురంలోని ఏపీ మోడల్ పాఠశాలలో చెకుముకి సైన్సు ప్రతిభా పరీక్షల పోస్టర్‌ను విడుదలచేశారు. ఉపాధ్యాయులు బాలిరెడ్డి, కిశోర్, రమణ,అంజనమ్మ,మల్లీశ్వరి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 11 : హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫర్ ఇండియా లీంక్‌వర్కర్స్ సూపర్‌వైజరు దర్బార్‌బాషా, ఖాదర్ బాషా, అబ్దుల్‌రహీం అన్నారు. బుధవారం మండలంలోని రజాసాహెబ్‌పేట పంచాయతీపరిధిలో తిరువెంగలాపురంలో మీకు తెలుసా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కాకండి

ఖాజీపేట, సెప్టెంబరు 11: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు, బానిసలు కావద్దని సీఐ మోహన్ అన్నారు. బుధవారం మోడల్ స్కూలులో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మూడో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డీఎంహెచ్‌వో గుణశేఖర్, స్టెప్ సీఈవో గ్రేస్ నిర్మల, ప్రిన్సిపాల్ విజయనరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

బద్వేలు, సెప్టెంబరు 11: వరద బాధితుల సహాయార్థం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా నెల్లూరు రోడ్డులోని సీపీఐ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు విరాళాలను సేకరించారు. ప్రజలు కూడా బాధితులకు అండగా విరాళాలు విరివిగా అందించినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. నేటి సేకరణలో భాగంగా రూ.10,065లు వచ్చాయని విరాళాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, పెంచలయ్య, జిల్లా సమితి సభ్యుడు పడిగే వెంకటరమణ, ఏఐవైఎఫ్ నాయకులు అనిల్, నవీన్, మహిళా సంఘం నాయకురాలు కుమారి, సలోమి పాల్గొని విరాళాలు సేకరించారు.

కలసపాడు..:విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల సీపీఐ సమితి నాయకులు ఆయా దుకాణాల వద్ద, గవర్నమెంటు ఆఫీసుల వద్ద విరాళాలు సేకరించారు. కలసపాడు సీపీఐ మండల సెక్రటరీ గుడిమె సునీల్‌కుమార్, సహాయ సెక్రటరీ నారాయణ, డీహెచ్‌పీఎస్ నాయకులు ఎస్.చిన్నప్ప, ఇన్సాఫ్ కమిటీ అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

అర్హులకు ఉపాధి పనులు కల్పించాలి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 11 : అర్హులైన పేదలందరికీ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కల్పించి పనులు చూపించాలని ఎంపీడీవో వెంగముని రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో సభాభవనంలో జాతీయ ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో వంద మంది ఉపాధి కూలీలు తగ్గకుండా పనులకు హాజరు కావాలన్నారు. ఏపీవో హరిక్రిష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 11 : స్థానిక పదో వార్డులోని శ్రీరాములపేటలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు నిర్వహకులు బహుమతులను అందించారు. ఈ పోటీల్లో 50 మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా మాజీ కౌన్సిలర్ మల్లీశ్వరీ, కపిలేశ్వర్ చిట్స్ డైరక్టర్ సునీత, పదో వార్డు టీడీపీ నాయకురాలు నల్లబోతుల పావని వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రసన్న, ప్రియాంక, జ్యోతి బహుమతులు సాధించారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర యూత్ ఆర్గనైజర్ నల్లబోతుల నాగరాజు, దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, చవ్వా శ్రీనివాసులరెడ్డి, సీకే నాయుడు పాల్గొన్నారు.



బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు

డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

● రిలే దీక్షలో ఆర్టీసీ కార్మికులు డిమాండ్

జమ్మలమడుగు, సెప్టెంబరు 11: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మేనేజర్‌పై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ప్రధాన రోడ్డు పక్కన కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో ఎస్‌వీఎస్ రాయుడు, కె.గంగాధర్, పి.శ్రీనివాసులు, రంగయ్య అనే వారు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్ష వద్ద రీజినల్ కార్యదర్శి సుధాకర్, ఎన్‌ఎంయూ డిపో ప్రెసిడెంట్ బ్రహ్మం మాట్లాడారు. ఆర్టీసీ డిపో సమస్యలపై రీజినల్ కార్యదర్శితోపాటు మరికొందరు జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డికి వినతి పత్రాలు అందించినా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుళరెడ్డి, డిపో కార్యదర్శి శివుడు, గ్యారేజీ కార్యదర్శి వలి, కాంతయ్య, నాగేంద్ర, ఎస్‌బీ వల్లి, రామలింగారెడ్డి, రమణ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఒకరోజు రిలేదీక్ష

బద్వేలు రూరల్, సెప్టెంబరు 11 : రీజనల్ కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒకరోజు రిలేదీక్షలు చేపట్టినట్లు ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడు జనార్దన్‌రావు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ పక్కనబెట్టి సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లు ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్రమైన పనిష్‌మెంట్లు, సస్పెన్షన్, రిమూవల్ చేయడం జరుగుతోందని ఇది చాలా అన్యాయమన్నారు. డిపో కార్యదర్శి చంద్రయ్య, కేఎస్ రాయుడు, మల్లి, ఎంఎస్‌రాయుడు, ఆర్‌బీరెడ్డి, ప్రసాద్, శ్రీధర్, ఉదయ్‌కుమార్, ఆచారి, నరసింహ పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: సమస్యల పరిష్కారానికి స్థానిక బస్టాండ్ సమీపంలో బుధవారం రీజనల్ కమిటీ పిలుపు మేరకు ఆర్‌టీసీ కార్మికులు ఒక రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కార్మికుల పలు సమస్యలపై ఎనిమిది నెలలుగా రాతపూర్వకం గా వినతులు అందిస్తున్నా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పత్తిలో గులాబీ రంగు పురుగు

ముద్దనూరు సెప్టెంబరు11:పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఆశించిందని,యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధి తిమ్మాపురం గ్రామంలో రైతులు పత్తి, కొర్ర పంటలను బుధవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి నాగభూషణ్‌రెడ్డి, కడప వ్యవసాయ పరిశోధన స్థానం అగ్రోనామి శాస్త్రవేత్త భాగవత ప్రియ పరిశీలించారు.పత్తి , కొర్ర పంటలను పరిశీలించి,పత్తి పంటను గులాబి రంగు పురుగు ఆశించిందని తెలిపారు. దాని నివారణకు ఎకరం పొలంలో 5 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి తయోడి కార్బ్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి లేదా క్వినాల్ ఫాస్ 2ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ వెంకటసుబ్బయ్య, వెంకటకృష్ణారెడ్డి,ఎంపీఈవోఎం జ్యోతి పాల్గొన్నారు.